క్లుప్తంగా

జిజ్ఞాస పోటీల్లో 'కేఆర్‌ఆర్' విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కోదాడ : హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో కోదాడలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హెచ్చరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్ట్‌ల్లో విద్యార్థులు ప్రతిభ చూసి ప్రశంసాపత్రాలు పొందినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు అధ్యాపకులు చందా అప్పారావు, సైదులును ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

కోదండ రామాలయానికి ఇత్తడి తొడుగు బహూకరణ



నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో గల శ్రీకోదండ రామాలయం గర్భగుడి ముఖద్వారానికి రూ.80 వేల విలువ గల దశావతారాలు, శంకు చక్రాలతో కూడిన ఇత్తడి తొడుగును అదే గ్రామానికి చెందిన కృష్ణవంశీ– హైందవి దంపతులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు హరి సురేష్‌కుమార్ శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ గర్భగుడి ప్రధాన ముఖద్వారానికి ఈ ఇత్తడి తొడుగు అమర్చారు.

పని ప్రదేశాల్లో భద్రత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న డెక్కన్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు

పాలకవీడు : పని ప్రదేశాల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పరిశ్రమలో నిర్వహించిన జాతీయ భద్రత వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. డెక్కన్ సిమెంట్ పరిశ్రమ ఇప్పటికే ప్రమాద రహిత పరిశ్రమగా గుర్తింపు పొందిందని తెలిపారు. అనంతరం భద్రతా ప్రమాణం చేయించారు. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాటి ప్రభాకర్ రెడ్డి, ఎంఎస్ఎన్ రాజు కోరారు. ఈమేరకు మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో మొత్తం నాలుగు మున్సిపల్ లేఔట్ స్థలాలు ఉన్నాయని, అందులో ఏదైన ఒక స్థలం కేటాయిస్తే మినీ కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడానికి అభివృద్ధి కమిటీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఇదే విషయంపై స్థానిక ఆర్డీఓకు కూడా వినతిపత్రం ఇవ్వనున్నట్లు వారు చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

నేరేడుచర్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊట్కూరి సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 10వ తేదీ నుంచి ఎస్సీ సెల్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెదుమంగ అజయ్, పెదపంగ ప్రవీణ్, రామకృష్ణ, పాండు నాయక్, భాస్కర్, కొడిరెక్క పవన్, గోపాల్, వెంకటేష్, రత్నం, నగేష్ తదితరులు ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

నేరేడుచర్ల : ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చికలరాజు శ్రీను అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో జరిగిన ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాయమాటలతో ఓట్లు వేయించుకున్నారన్నారు. ఏడాదిలో 55, 143 ఉద్యోగాలను మాత్రమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భర్తీ చేసిందని, రాష్ట్రంలో 1, 91, 126 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు పెరిక భరత్, దూపాటి అనిల్, వినయ్, జయంత్ ఉన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా !

- ఒక్క వాహనానికి స్లాట్ బుక్ చేసి రెండుమూడు ట్రిప్పులు తరలింపు
- సెలవు రోజుల్లోనూ యథేచ్ఛగా..
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు



కొత్తగూడెం ఇసుక రీచ్ వెనుదిరిగి వెళ్తున్న అనుమతులు లేని ట్రాక్టర్

అనంతగిరి : మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. వినియోగదారులు ఒక్క ట్రిప్ వాహనం ఇసుకను బుక్ చేసుకుంటే ట్రాక్టర్ల డ్రైవర్లు రెండుమూడు ట్రిప్పుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దళారులే మన ఇసుక వాహనం వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకొని ఎక్కువ ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క స్లాట్‌తో రెండు ట్రిప్పుల ఇసుకను తరలించేందుకు కొందరు ప్రభుత్వ అధికారులే అనధికారికంగా అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెలవు రోజుల్లోనూ ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారు. సెలవు రోజున రాత్రి వేళలో సుమారు 20 నుంచి 30 ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మండలంలోని కొత్తగూడెంలో ఇసుక రీచ్ ఉండగా, అక్కడ కూడా కొందరు వ్యక్తులు గ్రామాభివృద్ధి పేరుతో ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.100 నుంచి రూ.120 బహిరంగంగా వసూలు చేస్తున్నారని, వారు అక్రమ ఇసుక వ్యాపారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు కూడా అక్రమంగా ఇసుక తరలించేందుకు సహకరిస్తూ దళారుల నుంచి వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇసుక రీచ్ నుంచి 10 కిలోమీటర్ల వరకు ట్రిప్పు ఇసుకకు రూ.4వేల వరకు పెంచడంతో వినియోగదారులపై భారం పడుతోందని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తాం

ఇసుక అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. అనుమతులు లేకుండా ఎవరైన పాలేరు వాగు నుంచి ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలను పాటించాలి.

– కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. గత రెండు నెలల్లో సుమారు 11 ట్రాక్టర్లపై కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

– ఎస్‌ఐ నవీన్‌కుమార్, అనంతగిరి

విధుల్లోకి తీసుకోవాలని కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కోదాడ : తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు మున్సిపల్ కార్మికులు మంగళవారం కోదాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కోదాడ మున్సిపాలిటీలో గతంలో తొలగించిన వంద మంది కార్మికులలో ఇంకా 30 మందిని విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. అధికారులు కొందరిని మాత్రమే విధుల్లోకి తీసుకొని మిగతావారిని పక్కన పెట్టడం సరికాదన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మార్చిలో అవసరమైతే మరో 30 మందిని కూడా విధుల్లోకి తీసుకుంటామని కమిషనర్ తమకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ముత్యాలు, బుచ్చారావు, వినోద్, వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటపుల్లారావు, పద్మ, విమల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



జాన్‌పహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

పాలకవీడు : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన జాన్‌పహాడ్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాకర్, ఎంపీడీఓ లక్ష్మి, హౌసింగ్ ఏఈ సాయిరాంరెడ్డి, నాయకులు ఎస్‌వి.సుబ్బారావు, మాళోతు మోతీలాల్, నరసింహారావు, బాణోత్ సైదా, జ్యోతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేరేడుచర్ల : పట్టణంలోని అంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం సంస్కృతి, సంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు దేశంలోని 29 రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయ దుస్తులు ధరించగా, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ కులవృత్తిదారుల వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అలక సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ అలక సరిత, పాఠశాల సిబ్బంది నాగ ప్రసాద్, యాకుబ్, వీరాంజనేయులు, సతీష్, జానకిరాములు, జనార్దన్, రవీందర్, ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



లక్ష్మయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిలుకూరు : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కబడ్డీ క్రీడాకారుడు కొడారు లక్ష్మయ్య (65) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటరెడ్డి, కార్యదర్శి పింగ్రాతి హనుమంతరావు, మాజీ ఎంపీపీలు బొలిశెట్టి నాగేంద్రబాబు, బజ్జూరి వెంకటరెడ్డి, దొడ్డా సురేష్, బండ్ల ప్రశాంతి, కోటయ్య, సహకార సంఘాల చైర్మన్లు కొండా సైదయ్య, అలసకాని జనార్దన్, బజ్జూరి రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి జిల్లా రవాణాశాఖ అధికారి

కోదాడరూరల్: వాహనదారులు రోడ్డుభద్రతా నిబంధనలను తప్పక పాటించాలని కామారెడ్డి జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం కోదాడకు వచ్చిన ఆయన లారీ యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లారీ యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని లారీల యజమానులు ఆయనను కోరారు. అనంతరం పూలమాలలతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు రామినేని శ్రీనివాసరావు, తూనం కృష్ణ, పైడిమర్రి వెంకటనారాయణ, యలమందల నరసయ్య, చంద్రమౌళి, బాబా, లింగయ్య, సుధాకర్, ప్రసాద్, రఫీ ఉన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



గోపాలపురంలో ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, అలంకరణ, పంచామృతాలతో అభిషేకం, గంధ సింధూరం, ఆకుపూజ, మంగళశాసనం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఆలయాల ఈఓలు ఎంపి లక్ష్మణరావు, చలపతి, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, అలహరి నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమార్ చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 207 మంది, గురుకుల పాఠశాలలో 208 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ప్రిన్స్‌పాళ్లు డి.విజయ నాయక్, చింతలపాటి వాణి మంగళవారం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను తహసీల్దార్ వి.సరిత పరిశీలించారు.

నేలమర్రిలో జోరుగా పేకాట!

మునగాల: మండలంలోని నేలమర్రిలో గత కొంతకాలంగా యువత, విద్యార్థులు జోరుగా పేకాట ఆడుతున్నారని, గ్రామంలో పేకాటను అరికట్టాలని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌లో పెట్టిన పోస్ట్ మంగళవారం వైరల్‌గా మారింది. గ్రామంలో విద్యార్థులు, యువతకు పేకాట వ్యసనంగా మారిందని, రహస్య స్థావరాలు ఏర్పాటు చేసుకొని పేకాట ఆడుతున్నారని అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతల సహకారం అభినందనీయం

నడిగూడెం : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి అన్నారు. మంగళవారం కరివిరాల మోడల్ స్కూల్‌లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ ఓరుగంటి రవి, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు నూనె నాగన్న, జిల్లా సహాయ కార్యదర్శి దివ్వెల శ్రీను, నాయకులు అర్వపల్లి హనుమంతరావు, మొరిశెట్టి వెంకట రమణారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

చిలుకూరు : మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ గ్రాండ్ నిధులు రూ.25 వేల విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివ కుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు వైఎల్ఎన్.స్వామి, అరుందతి, పరిమళ, వెంకన్న పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్లు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టౌన్ హాల్‌లో మంగళవారం ఖమ్మంకు చెందిన స్మార్ట్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో మాజీ కౌన్సిలర్ గాయత్రి భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పలువురు మాజీ కౌన్సిలర్లు ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఖమ్మంలోని హాస్పిటల్‌లో ఉచిత శస్త్ర చికిత్స చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, సాంకేతిక సిబ్బంది విక్రమ్‌సింగ్, శ్రీకాంత్, పాష, మాజీ కౌన్సిలర్లు ఎ.సతీష్, వి.నాగేశ్వరరావు, కె.శ్రీను, జె.శంభయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్

పాలకవీడు : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నాగిని అన్నారు. మంగళవారం మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రోజుల తరబడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉన్నవారు తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 70 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, రమ్య, ఆరోగ్య కార్యకర్త నర్సయ్య, ఏఎన్ఎంలు, ఆశా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మామిళ్లగూడెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మోతె : అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మామిళ్లగూడెం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, నర్సరీలను పరిశీలించారు. మామిళ్లగూడెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడారు. ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందే భోజనం, విద్యపై ఆరా తీశారు. తదనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ మోడల్ ఇల్లు ఎలా నిర్మిస్తున్నారో, ఇంటికి ఉపయోగించే సామగ్రికి అయ్యే ఖర్చులతో కూడిన పట్టికను ఇంటి ముందు ప్రదర్శించి లబ్ధిదారులకు అవగాహన పరచాలని అధికారులకు సూచించారు. పది రోజుల్లో ఇందిరమ్మ మోడల్ ఇంటిని పూర్తి చేయించాలని ఆదేశించారు. అనంతరం మోతె తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ అప్పారావు, ఆర్‌డీఓ వేణుమాధవ్, మండల ప్రత్యేకాధికారి సీతారాం నాయక్, ఎంపీడీఓ ఆంజనేయులు, హౌజింగ్ ఏఈ మూర్తి, టీపీ సురేష్, ఈసీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష



బరాఖత్‌గూడెంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : ప్రస్తుత వేసవిలో నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ డి.శిరీష సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మునగాల మండల కేంద్రంతో పాటు కృష్ణానగర్, గణపవరం గ్రామాల్లో గల నర్సరీలను ఆమె పరిశీలించారు. నర్సరీలో మొక్కలకు సంరక్షించేందుకు షేడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని, మొక్కలు వంద శాతం బతికేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా బరాఖత్‌గూడెంలో ఉపాధి హామీ సిబ్బంది చేపడుతున్న డొంక రోడ్డు పనులను తనిఖీ చేశారు. అనంతరం గణపవరంలో పశువుల కొట్టం నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీఓ దార శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈఈ అనిల్, ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, టీఏలు శ్రీధర్, శేఖర్, పంచాయతీ కార్యదర్శులు సైదులు, శ్వేత, వీరారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు సులోచన, విజయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి

మునగాల : పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ డి. శిరీష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, వసతి గృహాన్ని స్థానిక ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులుతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తదనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లుతో పాటు తాడువాయిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు.

వరిపైర్లకు అగ్గితెగులు, సుడిదోమ



మునగాలలో వరిపైరును పరిశీలిస్తున్న ఏడీఓ, ఏఓ

మునగాల : ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పైర్లకు అగ్గితెగులు, కంపునల్లి, సుడిదోమ తాకిడి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని కోదాడ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.ఎల్లయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఓ బుంగా రాజుతో కలిసి వరిపైర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత వారం రోజులుగా రాత్రి వేళలో ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరగడంతో వరికి అగ్గితెగులు ఎక్కువైందన్నారు. అగ్గితెగులును తొలిదశలోనే నివారించకపోతే క్రమంగా కంకుల మెడపై నల్లని మచ్చలు ఏర్పడి కంకులలోకి పోషకాలు అందకపోవడం వల్ల మెడలు విరిగిపోయి, వేలాడుతూ గింజలు తాలుగా మారిపోతాయని వివరించారు. తెగుళ్ల నివారణకు యూరియా చల్లడం వెంటనే నిలిపివేయాలని, ట్రైసైక్లోజెల్ 0.6 గ్రా లేదా ఐసోప్రోథాయిలిస్ 1.5మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5మి.లీ, లీటరు నీటిని కలిపి పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు రమ్య, భవాని, రేష్మ, నాగు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం.. మహిళల జన్మహక్కు

- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



సమాఖ్య జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన

హుజూర్‌నగర్ : ఆత్మగౌరవం అనేది మహిళల జన్మహక్కు అని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. మహిళల మీద జరుగుతున్న లైంగికదాడులను అరికట్టేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి దేవర మల్లేశ్వరి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉపతల కోటమ్మ, పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహిళా నాయకులు పానుగంటి పద్మ, సుందరి పద్మ, చింతకుంట్ల విజయ, బండి ప్రమీల, లలిత లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు దేవరం లక్ష్మి, అంజలి, ఇందిరాల సంధ్య, జాహ్నవి, మీరా, పుష్పమ్మ, జానకమ్మ, నాగమణి, విజయ, పద్మ, ఆశ, సంధ్య, విశాలి, నాగలక్ష్మి, అఖిల, కస్తూరి, రమాదేవి, రవళి, రేణుక, నాగమణి, గీత, అనూష, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరం అభివృద్ధికి రూ.రెండు లక్షల విరాళం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల సాయి మందిరం అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన దేవినేని సీతారామయ్య –మాధవి దంపతులు రూ.రెండు లక్షల విరాళం అందజేసినట్లు సాయిమందిరం నిర్వాహకుడు దేవినేని రవికుమార్ తెలిపారు. గతంలోనూ వీరు సాయిమందిరం నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠకు సుమారు రూ.16 లక్షల విరాళం ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా నర్సింహులగూడెం గ్రామవాసి జూలకంటి వెంకటేశ్వర్లు–నాగమణి దంపతులు ప్రతినెల మందిరంలో దూపదీప, నైవేద్యం, అర్చకుడి వేతనం నిమిత్తం రూ.15వేలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు రవికుమార్ తెలిపారు.

డయాబెటిస్ సర్వీస్ కిట్టు అందజేత

నేరేడుచర్ల : నేరేడుచర్ల లయన్స్ క్లబ్‌కు జిల్లా జీఎల్‌టీ కోఆర్డినేటర్, పీఎంజేఎఫ్ లయన్ సతీష్‌కుమార్ మంగళవారం డయాబెటిస్ సర్వీస్ కిట్టును అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామికి డయాబెటిస్ టెస్టింగ్ మిషన్, టెబుల్, చైర్లు, గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ చైర్ పర్సన్ బట్టు మధు, యడవల్లి సత్యనారాయణరెడ్డి, క్లబ్ కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, సభ్యులు విశ్వనాథ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నడిగూడెం : నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ రవీందర్ కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో గల నర్సరీలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆలయంలో అన్నదానం

చిలుకూరు : మండల కేంద్రంలో కాల్వ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఖమ్మం జిల్లా కొత్త కమలాపురం గ్రామానికి చెందిన కొత్త తిరపయ్య –మంగతాయి, కొత్త హరికృష్ణ బాబు –రమ్య దంపతుల సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అర్చకులు రజనీకాంత్, ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వరరావు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదవరపు లక్ష్మయ్య, కట్టెకోల చంద్రయ్య, బొబ్బ సమ్మిరెడ్డి, కొడారు శ్రీనివాసరావు, గోగుల వీరభద్రం, లక్ష్మి, రోజా భవాని, మంగమ్మ, సుజాత, పద్మ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మండల పరిధిలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చన, అమ్మవార్లకు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎదుర్కోళ్ల మహోత్సవం అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణతో కల్యాణతంతు నిర్వహించారు. అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.